క్లుప్తంగా

శేషుకుమారికి ఏరువాక ఫౌండేషన్ అవార్డు



శేషుకుమారి, హరినాథ్ దంపతులను సత్కరించి, అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన యర్రా శేషుకుమారికి మిద్దె తోటల పెంపకంలో ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డు లభించింది. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్ వ్యవసాయ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శేషుకుమారి, హరినాథ్ దంపతులను శాలువాతో సత్కరించి అవార్డును ఏపీ అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఇతర ముఖ్యఅతిథులు అందజేశారు. శేషుకుమారి మాట్లాడుతూ తన భర్త హరినాథ్ సహకారంతో మిద్దెతోటల పెంపకం చేపట్టానని, ఆసక్తి ఉన్న మహిళలకు యూట్యూబ్ ద్వారా మిద్దెతోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

రైతులు సూచనలు పాటించాలి

కడియం: మండలంలో వరి సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ద్వార కాదేవి కోరారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రి దుబ్బుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ అవసరమైనంత వరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలన్నారు. అలా కాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే మేలు కంటే కీడే అధికమని రైతులు గుర్తించాలని కోరారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మిత్రపురుగులు అధికంగా ఉంటే ఎటువంటి పురుగుమందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నప్పుడు రసాయన పురుగు మందులను అధికంగా వినియోగిస్తే వాటి సంఖ్య తగ్గి, శత్రు పురుగులు పెరుగుతాయన్నారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయక సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి

ప్రకాశం నగర్: సీనియర్ సిటిజన్లను గౌరవించడం అందరి బాధ్యత అని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వృద్ధులతో కలిసి సీనియర్ సిటిజన్స్‌డే నిర్వహించారు. వారితో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల కోసం స్వర్ణాంధ్ర సంస్థ రెండు దశాబ్దాలుగా సేవలందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, దివ్య, ప్రవల్లిక, శశికళ పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై ఉద్యోగుల నిరసన

ప్రకాశం నగర్: ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఎస్సీఆర్ఎంయూ శాఖల ఆధ్వర్యంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పీవే కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఓ.విజయ కుమార్ మాట్లాడుతూ న్యూఢిల్లీలో జరిగిన మహాధర్నా ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కార్మికుల శక్తిని తెలియజేశామన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా నిరసనలు కొనసాగించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రకాశం నగర్: విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల ద్వారా అపరిచిత వ్యక్తులు పెడుతున్న ప్రలోభాలకు లోనుకాకూడదని దిశ పోలీస్ స్టేషన్ సీఐ రమణమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఆలీ సూచించారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మూడో రోజు దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డిగ్రీ మొదటి సెమిస్టర్ విద్యార్థినులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న దీక్షారంభ్ కో ఆర్డినేటర్, సంస్కృతశాఖాధిపతి పి.శ్రీవల్లి, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ బి.అనురాధ, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎం.సునీతను అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జ్ఞానాన్ని సంపాదించాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు భరోసా

- ఖరీఫ్ సీజన్‌కు ముందు నుంచే కార్డుల జారీ
- 11 నెలల కాల పరిమితితో అందజేత
- రూరల్ నియోజకవర్గంలో 6,100 కార్డుల పంపిణీ



తొర్రేడులో కౌలురైతుకు సాగుదారుకార్డు అందజేస్తున్న చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కౌలు రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం 2019 భూయజమాని హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా, కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సమయంలో వారికి సాగుదారుకార్డులిచ్చి ఆర్థికంగా చేయూతనిస్తోంది. ఈ కార్డుపై సంతకం చేయడం వలన భూయజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టంలో మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఈ చట్టం విషయంలో భూయజమానులు నిశ్చింతగా ఉండవచ్చునని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులో భూయజమానులు, కౌలురైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, గ్రామ వలంటీర్లు, వీఆర్‌వోలు ప్రోత్సహించాలని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా, వారి హక్కుల పరిరక్షణకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తూ, సాగుచేసే రైతులకు పంట రుణం పొందడానికి వీలుగా కార్డు మంజూరు చేసేందుకు కొత్త చట్టం తీసుకువచ్చింది. సాగుదారులకు ఇది వరంగా మారింది.

సాగుకార్డు పొందడం ఇలా..

సాగుదారుకార్డు భూయజమానికి, సాగు చేస్తున్న రైతులకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డుపైన భూయజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్‌వో, ఆథరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురి సంతకాలూ ఉండాలి. ప్రత్యేకంగా మరే పత్రాన్ని భూయజమాని రాసి ఇవ్వనవసరం లేదు. పంటసాగుదారు కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే. ఆ తరువాత సాగుదారు మళ్లీ కొత్తకార్డు పొందాలి. గ్రామ వలంటీర్ ద్వారా తమకు దగ్గరలోని రైతుభరోసా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వీఏఏను కలిసి కార్డుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. సాగుదారుకార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు ఉండవు. కేవలం పంటరుణాలు, పంటబీమా, సబ్సిడీలు వంటి ప్రభుత్వ మద్దతు పొందడానికి మాత్రమే ఈ కార్డు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణం తీసుకుంటే దానిని తిరిగి కట్టే బాధ్యత పూర్తిగా అతడిపైనే ఉంటుంది. ఏ కారణం వల్లనైనా కట్టలేకపోతే భూయజమానిపై కానీ లేదా ఆ భూమి పైన కానీ ఎటువంటి భారం భవిష్యత్తులో ఉండదు.

జూన్ ఒకటి నుంచే కార్డుల జారీ

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వ్యాప్తంగా 21 గ్రామాల్లో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5,138 మందికి సాగుకార్డులను జారీచేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికే ముందే అంటే జూన్ ఒకటి నుంచే కార్డులను అందజేస్తున్నారు. ఇప్పటికే 6,100 కార్డులు పంపిణీ చేశారు. జూలై ప్రారంభం నుంచి జరిగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా చాలా మంది కౌలురైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేశారు. మూడేళ్ల నుంచి సాగుకార్డులు పొందుతున్న వారిని బట్టి అవగాహన లేక భూయజమానులు సహకారం ఇవ్వకపోవడం వల్ల కౌలురైతులు సాగుకార్డులు పొందలేకపోతున్నారనే వాదన కూడా ఉంది. ఇటువంటి వారిని చైతన్య పరుస్తుండంతో ఈసంఖ్య పెరుగుతూ వస్తోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సాగుకార్డుల వివరాలు

మండలం	గతేడాది	ఈ ఏడాది (ఇప్పటివరకూ)
కడియం	3,735	4,155
రాజమహేంద్రవరం రూరల్	1,403	1,945
మొత్తం	5,138	6,100

భూ యజమానులకు అవగాహన



కౌలురైతులకు సాగుకార్డుల జారీ విషయంలో భూ యజమానుల అపోహలను నివృత్తి చేస్తున్నాం. ఇందుకోసం ఆర్బీకేల పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. భూమిపై కౌలురైతులకు ఎటువంటి హక్కులుండవని స్పష్టం చేస్తున్నాం. పంట రుణాలు తీసుకున్నా మీరు ఎటువంటి సంతకాలు చేయనక్కర్లేదని, కేవలం కౌలుకార్డుపైనే చేస్తే సరిపోతుందనే విషయాన్ని రైతులకు అర్థమయ్యేలా చెబుతున్నాం. స్థానిక ఆర్బీకేలలో సాగుకార్డు కోసం సంప్రదించవచ్చు.

– డి.శ్రీనివాసరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, రాజమహేంద్రవరం

కౌలురైతులకు వరం



సాగుదారుకార్డు ద్వారా కౌలురైతుల చేపట్టే సాగుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. తొర్రేడు గ్రామంలో 5.60 ఎకరాలను కౌలుకు సాగుచేస్తున్నాను. రైతుభరోసా రూ.13,500 రావడంతో సాగుఖర్చుకు ఎటువంటి ఇబ్బందులు లేవు. కౌలురైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సాగుదారుకార్డు ఒక వరం.

– రౌతు వెంకట రమణ, కౌలురైతు, తొర్రేడు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కేఆర్‌సీ డివిజన్ తహసీల్దార్ శ్రీనివాసరావు

సీటీఆర్ఐ: వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) డివిజన్ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరఫున ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై తొమ్మిది అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఎఎల్ఎస్ దేవి, వివిధ శాఖల డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో..



కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ దినేష్ కుమార్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై 14 అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

చందన నాగేశ్వర్‌కు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలోని ముస్లిం బరియల్ గ్రౌండ్ సమస్యను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరిష్కరించారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం పెద్దలు ఆయనను కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ ముస్లింల ఆస్తుల పరిరక్షణతో పాటు, మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రూరల్ నియోజకవర్గంలో ముస్లింలకు ఏఅవసరం వచ్చిన ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కన్నకొడుకే పొమ్మంటున్నాడు

రాజమహేంద్రవరం రూరల్: ఆస్తి రాయించుకున్న కుమారుడు తనను ఇంటి నుంచి బయటకు పొమ్మంటున్నాడని కాతేరు సొసైటీ బిల్డింగ్స్ టీచర్స్ కాలనీకి చెందిన చలువాది వరలక్ష్మి సోమవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా.. ఆమె భర్త మృతి చెందాడు. అతడి పేరుమీద ఉన్న ఆస్తిని పెద్ద కుమారుడు సత్యనారాయణ రాయించుకున్నాడు. ఇంటిలో ఉంటున్న తల్లి వరలక్ష్మి, తమ్ముడు మాలకొండయ్యను దుర్భాషలాడుతూ ఇంటి నుంచి పొమ్మంటున్నాడు. ఏఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంత భవనాలతో మెరుగైన సేవలు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడు, వెంకటనగరంలో భవనాల ప్రారంభం



సచివాలయం-1 భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, ఉప్పులూరి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్నెస్ సెంటర్లకు సొంత భవనాలు సమకూరడంతో, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వెంకటనగరంలోని సచివాలయం, రైతుభరోసాకేంద్రాలను, తొర్రేడు సచివాలయం -1, 2లలో గ్రామసచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను సోమవారం డీసీసీబీ చైర్మన్ ఆకులవీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. తొర్రేడులో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. మహిళలకు అన్ని సంక్షేమ పథకాలలోను పెద్దపీట వేస్తూ, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లోనూ 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తొర్రేడు, వేమగిరి, జేగురుపాడు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి, వారి సొంతింటి కలను నెరవేర్చారన్నారు.

ప్రజల ముంగిటకు సేవలు

డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట సంతోషాలు వెల్లివిరిస్తున్నాయన్నారు. అనంతరం కౌలురైతులకు సాగుదారుకార్డులను చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, ఉప్పులూరి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి కేశవ రామారావు, తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, పర్సన్లు దండమూడి అర్జునరావు, గద్దే సుబ్బారావు, కాతేరు సొసైటీ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, పార్టీ నాయకులు ఉప్పులూరి రాము, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్, పంచాయతీ కార్యదర్శులు హనుమంతరావు, చెరుకూరి రాణి పాల్గొన్నారు.

మాతృమరణాల నివారణకు మార్గదర్శకాలు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో మాతృమరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నూతన మార్గదర్శకాలను జారీ చేసిందని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకారం.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను కచ్చితంగా వినియోగించుకోవాలి. డెలివరీ తేదీకి ముందు తీవ్రమైన రక్తహీనత ఉన్న ప్రతి గర్భిణీనీ రక్తమార్పిడి కోసం ఇంటి నుంచి ఆసుపత్రికి ఈ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించాలి. గర్భిణులందరికీ తప్పనిసరిగా రెండుసార్లు సాధారణ స్కానింగ్ చేయాలి. బాలింతలకు హిమోగ్లోబిన్ స్థాయి మెరుగుపరచడానికి ప్రసవానంతరం ఫెర్రిక్ కార్బోక్సీమల్టోస్ ఇంజక్షన్ (ఎఫ్‌సీఎం) ఇవ్వాలి. తద్వారా వారిలో రక్తహీనతను అరికట్టవచ్చు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ అనసూరి పద్మలత

ప్రకాశం నగర్: మహిళా సాధికారతకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఏడు నియోజకవర్గాలలో పర్యటించి ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు 36 మందితో వైద్య విభాగం కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. డాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో కలిసిన సందర్భంగా బీసీ బిల్లు ఆమోదించాలని, బీసీ బిల్లులో మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల రిజర్వేషన్ అమలు చేయాలని తెలిపామన్నారు. సమావేశంలో బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, ధవళేశ్వరం మాజీ ఎంపీటీసీ పెరుమాళ లక్ష్మీసుజాత, హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శి కొతుర్తి రమణ, బీసీ నాయకుడు గుత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



సూర్యారావుపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దంపతుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 110 దేవాలయాలలో సోమవారం దశ సహస్ర సువాసిని స్వహస్తేతి కోటి కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో వేలమంది మహిళలతో పురోహితులు కుంకుమార్చనలు చేయించారు. జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు పాల్గొన్నారు. అనంతరం రాజానగరంలో గ్రామదేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ, నూకాలమ్మ ఆలయాల్లో జరుగుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధితో పాటు నియోజకవర్గంలో ప్రజలందరూ ఆరోగ్యంతో ఆనందంగా ఉండాలనే సంకల్పంతో నాగ పంచమి, మానసాదేవి జయంతిని పురస్కరించుకుని లలితాదేవి, మానసాదేవి అమ్మవార్లకు కోటి కుంకుమార్చన కార్యక్రమం చేపట్టామన్నారు. తన మాతృమూర్తి జక్కంపూడి విజయలక్ష్మి పర్యవేక్షణలో నియోజకవర్గంలోని దేవతామూర్తుల ఆలయాలలో ఈ పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, స్థానిక నాయకులు వాద్రేవు శ్రీనివాస కుమార్, ప్రగడ చక్రి, ఇలపకుర్తి కామేశ్వరరావు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, సంగీత ప్రసాద్, నీలపాల శివరామకృష్ణ, నాగ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని పలు ఆలయాల్లో కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉమ్మడి జిల్లాల పార్టీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి పర్యవేక్షించారు. సీతానగరంలోని సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామిరి ఆలయంలో జరిగిన సామూహిక పూజలో సుమారు 50 మంది దంపతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



దాసరి దుర్గాప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్: భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు తిరిగిరాలేదని తాడితోట బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన దాసరి సత్యవతి సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కుమారుడు 29 ఏళ్ల దాసరి దుర్గాప్రసాద్‌కు భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన దుర్గాప్రసాద్ తిరిగి రాలేదు. ఈ మేరకు వన్‌టౌన్ ఏఎస్సై వినూత్న కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, నగదు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంట్లోని బంగారం, నగదును దొంగలు చోరీ చేశారని బొమ్మూరు మురళీకొండ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మామిడిశెట్టి ప్రభాకరరావు సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభాకరరావు భార్యతో కలిసి మురళీకొండ ప్రాంతంలో నివసిస్తున్నారు. స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన బంధువుకు ఆరోగ్యం సరిలేకపోతే ఈ నెల 16వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి అక్కడకు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి తన ఇంటి తాళం తెరిచి ఉంది. లోపలక వెళ్లి చూడగా పడకగదిలోని బీరువాలోని నాలుగుకాసుల బంగారం గొలుసు, రూ.40 వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్న భర్తపై కేసు

బిక్కవోలు: భర్త వేధింపులకు గురిచేస్తున్నాడంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. బలభద్రపురం గ్రామానికి చెందిన కన్నూరి వెంకటలక్ష్మికి సింహాచలంతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. సింహాచలం చాలా మందితో శారీరక సంబంధాలు పెట్టుకుని భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపు చేస్తున్నాడు. అతనికి అత్త, మామతో పాటు మరిది, ఆడపడుచు కూడా సహకారిస్తున్నారని వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసింది.